ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 31-12-01, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు భగవాన్ శ్రీరమణమహర్షి 122వ జయంతి. ఆయనకు 16వ సం॥లో మరణానుభవం కలిగింది. మరణంవచ్చి మీదపడింది, శరీరంశవంఅయ్యింది, శ్వాస ఆగిపోయింది. కాని ఈ శరీరంతో సంబంధంలేకుండా ఆయన ఉన్నట్లు ఆయనకు తెలుస్తోంది. ఈ శరీరాన్ని స్మశానానికి తీసుకొనివెళ్ళి కాల్చేస్తారు. శరీరం పోయినప్పుడు నేనుపోవాలికదా. కాని శరీరంపోయినా నేను ఉన్నాను, శరీరం లేకపోయినా నేనుఉంటాను, నేను ఎప్పుడూ ఉంటాను అనేటువంటి ఆత్మస్థితి, చైతన్యస్థితి ఆయనకు అనుభవంలోనికి వచ్చింది. మరణానుభవంద్వారా ఈ దేహమేనేనుఅనే భావనపోయింది. మరణానుభవం పొందినతరువాత సమాధిస్థితివరించివచ్చి ఆయనమీదపడుతోంది, కళ్ళు మూతలుపడుతున్నాయి. అన్నగారుఏమన్నారుఅంటే నీవు యోగిలాగకనబడుతున్నావు, నీబోటివాడికి ఇంటిదగ్గర పనిఏముంది? ఎక్కడికైనా పోరాదాఅన్నాడు. ఈమాటలుఅనేది అన్నగారుకాదు అది ఈశ్వరవాణి. అరుణాచలం తీసుకొనిపోవటానికి ఇది అంతా అరుణాచలేశ్వరుడు చేసేపని. ఆ మాటలకు ఆయనకు కోపంరాలేదు. ఎక్కడికిపోవాలిఅని ప్రశ్నవచ్చింది. అరుణాచలం, అరుణాచలం అని లోపలనుండి ప్రేరణవచ్చింది. అది పూర్వజన్మఅనుబంధం. 1896వ సం॥ సెప్టెంబరు 1వ తేదీన అరుణాచలం వచ్చాడు. గుడిలోనికివెళ్ళి ఓతండ్రీ నీ ఆజ్ఞననుసరించి వచ్చానుఅన్నాడు. అప్పటినుండి 54 సం॥లు అరుణాచలంలో ఆదేహంతిరుగాడింది. ఈ 54 సం॥లలో ఈ అరుణాచలం విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళాలిఅనే తలంపు ఆయనకు రాలేదు. గుడిలోనుండి బయటకువచ్చిన తరువాత తన దగ్గరఉన్న స్వీట్స్, డబ్బు చెరువులోపడేసారు. వాటిని ఎవరికైనా ఇవ్వవచ్చుకదాఅనే తలంపుకూడా ఆయనకురాలేదు. ఆయనదృష్టిలో అసలు ఇతరులేలేరు. అప్పటినుండి గుడిప్రాంగణంలో కొంతకాలం, గుడికికొంతదూరంలోఉన్న తోటలో కొంతకాలంఉండి తరువాత విరూపాక్షగుహకు చేరుకొన్నారు. 1912వ సం॥లో విరూపాక్షగుహలో మొట్టమొదటగా ఆయన పుట్టినరోజును కొద్దిమంది భక్తులు కలిసిచేసుకొన్నారు. ఈదేహం పుట్టినరోజు గొడవ ఎందుకు? కనీసం ఆరోజుఅయినా ఈ నేనుఅనేతలంపు ఎక్కడపుడుతోందో చూడండిఅని భగవాన్ చెప్పారు. తరువాత కొంతకాలం స్కందాశ్రమంలోఉన్నారు. తరువాత శ్రీరమణాశ్రమం ఏర్పడింది.

అరుణాచలేశ్వరుడే టీచింగ్‌కోసం భగవాన్‌ను అక్కడకు తీసుకొనివచ్చాడు. ఆయన





చెప్పిన టీచింగ్ ఏమిటిఅంటే జీవితంఅంతా తలంపులే. సంతోషంఒకతలంపు, దుఃఖంఒకతలంపు, మరణంకూడానిజంకాదు అదికూడాతలంపే, ఈ జన్మఒకతలంపు, రాబోయేజన్మఒకతలంపు. దేహంఒకతలంపు. నీవుదేహంనుండి విడిపోవటంకాదు, దేహమునేనుఅనేబుద్ధినుండి విడిపోవాలి అదేసాధన. మనం నేను, నేనుఅంటున్నాము. అది దేహంతో తాదాప్యం పొందుతోంది. అదే ప్రథమతలంపు, మూలతలంపు. అదినీలోపలే ఉదయించివస్తోంది. అది నీలోపల ఎక్కడ పుడుతోందో అన్వేషించు. మూలతలంపుమూలంలోనే భగవంతుడు ఉన్నాడు, చైతన్యంఉంది. నీవు విచారణచేసి మూలతలంపు మూలంలోనికి నెమ్మదిగా వెళుతూఉంటే దానికివచ్చే ఇతరతలంపులు తగ్గిపోతాయి. మూలతలంపుమూలంలోనికి వెళితే మూలతలంపునశిస్తుంది, నీకు ఆత్మానుభవం కలుగుతుంది. ఆత్మకుచావులేదు, పుట్టుకలేదు కాబట్టి నీవు చావుపుట్టుకలతో సంబంధంలేని సమానస్థితిని పొందుతావు. ఈశరీరం మనంకాదు. కాని ఆత్మానుభవం పొందటానికి ఈశరీరాన్ని ఉపయోగించుకోవాలి. నదిని దాటటానికి నావను ఎలా ఉపయోగించుకొంటామో అలాగే మృత్యువునుండి అమృతత్వంపొందటానికి ఈ శరీరాన్ని నావక్రింద ఉపయోగించుకోవాలి. శరీరాన్ని సాధనకు ఉపయోగించుకోవాలి, మనస్సును ఈశ్వరుడికిఇవ్వాలి. దేహధర్మంప్రకారం కుటుంబఋణం, సమాజఋణం, ఋషిఋణం తీర్చుకొంటూవెళ్ళాలి. దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుకొంటే ఇవిఅన్నీ చేయగలము. మనస్సును మాత్రం ఈశ్వరునియందు నిలబెట్టి ఉంచాలి. ఈశ్వరుడిమీద తప్పించి మనస్సును ఎక్కడ ఉంచినా ఆశాభంగంతప్పదు, పునర్జన్మలుతప్పవు.

భగవంతుడు మనలోపలఉన్నాడు. ఆయన తప్పించి లోకంలోఏదోనిజంఉందిఅని నీవు అనుకొంటున్నావు. అందులోనుండి బయటకురా అదేసాధన. మన స్వభావం మారనప్పుడు, మనకు మారుమనస్సు రానప్పుడు భగవంతుడు మనలోపలేఉన్నా మనకు తెలియబడడు. జయాపజయములను, సుఖదుఃఖములను సమానంగా తీసుకోమని భగవంతుడు చెపుతున్నాడు. వాటిని సమానంగా తీసుకోలేకపోతే పునర్జన్మలుతప్పవు. సాధనచేయండి, విచారణచేయండిఅంటే మేము చాలా బిజీగాఉన్నాము అంటున్నారు. దీనికి భగవాన్ఏమిచెప్పారుఅంటే ఒకడుకళ్ళకు గంతలుకట్టుకొని వెళ్ళిపోతున్నాడట. వాడు ఎక్కడికి వెళుతున్నాడో వాడికే తెలియదు. ఎదురుగా వచ్చిన ఒకడు కళ్ళగంతలు విప్పకొనివెళ్ళు అనిచెప్పాడట. కళ్ళగంతలు విప్పకోవటానికి నాకు టైములేదుఅన్నాడట. మన పరిస్థితికూడా వాడిలాగేఉంది. ఎక్కడసత్యంఉందో వదిలేసి ఏవో కల్పించుకొని వాటిలో తిరుగుతూ మేము బిజీగా ఉన్నాము అంటున్నాము. జీవితంపొడుగునా సాధనచేస్తూ ఉండవలసిందేనాఅని

భగవాన్‌ను అడిగితే ఆయన ఏమిచెప్పారుఅంటే మీరుపెద్దకష్టపడిపోవద్దు. నిద్రపోయేముందు నిద్రపోవటానికి మనం ఎంతప్రయత్నంచేస్తామో అంత ప్రయత్నంచేయండిచాలు అన్నారు. మనకు నిద్రరాకపోతే చూడండి అనేక ప్రయత్నాలుచేస్తాము. తలక్రింద టెక్కావేసుకొంటాము, చాలకపోతే ఇంకోటెక్కావేసుకొంటాము, కాళ్ళక్రింద టెక్కావేసుకొంటాము, అటుఇటు తిరుగుతాము, గాలిసరిపోకపోతే ఫాను పెంచుకొంటాము, వేడిగాఉంటే ఎ.సి. వేసుకొంటాము. ఇంకా నిద్రరాకపోతే నిద్రబిళ్ళలు వేసుకొంటాము ఇలా అనేక ప్రయత్నాలుచేస్తాము. జ్ఞానం సంపాదించటానికి ఆమాత్రం ప్రయత్నంచేయండి సరిపోతుంది. జ్ఞానసముపార్జనకు మనం ఆమాత్రం ప్రయత్నంకూడా చేయటంలేదు. ధైనందినజీవితంలో అహంకారమును ఉపయోగించకు. మాటలవిషయంలో, ఆహారంవిషయంలో, నిద్రవిషయంలో తగుమాత్రంగా ఉండాలిగాని అతిపనికిరాదు. నీవు చదివే శాస్త్రంవిషయంలో, చేసే స్నేహాలవిషయంలో బహుజాగ్రత్తగాఉండాలి. ధనం సంపాదించటంకంటే, విద్యసంపాదించటంకంటే సహృదయంసంపాదించటం చాలాకష్టం. పాండిత్యం సంపాదించటంకంటే నైతికనిష్టను సంపాదించటంకష్టం. జరిగేదిఅంతా ఈశ్వరసంకల్పంప్రకారం జరుగుతోంది. నేనుఅదిసాధించాను, ఇదిసాధించాను అని నీవు అనుకొంటున్నావు. అది తీసి ఒకప్రక్కనపెట్టు. అదే సాధన.

ఈసృష్టిలో ఎవడు బుద్ధిమంతుడుఅని అడిగితే ఎవడైతే కర్మలోఅకర్మనుచూస్తున్నాడో వాడు బుద్ధిమంతుడుఅని పరమాత్మచెప్పాడు. వాడు కర్మనుచేస్తూఉంటాడు నేనుచేస్తున్నానుఅనే తలంపు వాడికి ఉండదు వాడు ఈసృష్టిలో బుద్ధిమంతుడు. వాడు ఆత్మజ్ఞానానికి అర్హతసంపాదిస్తాడు. వాడిద్వారా పనిజరుగుతూఉంటుంది, ఇలాచెయ్యాలి అలాచెయ్యాలిఅనే సంకల్పం వాడికి ఉండదు. దేహంనేనుఅనిఅనదు. అదిజడం. లోపల ఉన్న చైతన్యంనేనుఅని అనదు. దానికి నేనుఅనేతలంపులేదు. మధ్యలో ఒకడువచ్చాడు. వాడు చైతన్యంతో తాదాప్యం పొందటం మానివేసి దేహంతో తాదాప్యం పొందుతున్నాడు. నీవు ఆత్మనుచింతిస్తూఉంటే నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. విషయాలను చింతిస్తూఉంటే విషయబుద్ధి కలుగుతుంది. విషయబుద్ధి నరకం, ఆత్మబుద్ధివైకుంఠం. దేహంనేనుఅని దేహంచెప్పటంలేదు. లోపలమనస్సుచెపుతోంది, వాడేజీవుడు. వాడినిలోపలకు గెంటితే నీవేదేవుడుఅవుతావు. మనస్సుకు పరిమితమైనవాడు జీవుడు, మనోమూలంలోనికి వెళ్ళినవాడు దేవుడుఅవుతాడు. మనోమూలంలోనికి వెళ్ళినవాడి దేహం దేవాలయంఅవుతుంది. ఈదేహంఉండగా నీవు మనోమూలంలోనికి వెళ్ళావుఅనుకో నీదేహం పూజార్హతసంపాదిస్తుంది. మనోమూలంలో చైతన్యంఉంది. అక్కడికివెళితే ఆచైతన్యం తాలుక సుఖం, శాంతి, ఆనందం నీకువచ్చేస్తాయి. నీలోపల ఆత్మఉంది, చైతన్యంఉందిఅని నేను చెప్పిన ప్రయోజనంలేదు. నీవు అక్కడకువెళ్ళాలి, దానితాలుక అనుభవం నీవుపొందాలి అప్పుడు ఆ సుఖం, శాంతి, ఆనందం నీకు తెలుస్తాయి.

ఆత్మకు భిన్నంగా ఈసృష్టిలో ఏమీలేదు. అంతాఆత్మే. నీవుఏదైతేకాదో అందులోనుండి విడుదలపొందాలిఅనుకొంటున్నావుఅనుకో దానిని స్మరించటంవలన అందులోనుండి విడుదలపొందలేవు. ఆత్మనిష్టవలన, ధైవనిష్టవలన నీవుకానిదానిలోనుండి విడుదలపొందుతావు. ఏదైతేఉందో దానినిష్టలోఉండు అప్పడుకానిదానిలోనుండి విడుదలపొందుతావు. ఆత్మస్థితి సహజమైనది అందులోనుండి ఎందుకుబయటకువస్తున్నావు? ఏకారణంవలన సహజస్థితినుండి బయటకువస్తున్నావో ఆ కారణాలను కాల్చిబూడిదచెయ్యి. అధ్యాసవలన జీవుడుకి సంసారం ప్రారంభమయింది అనిచెపుతారు. అధ్యాసఅంటే ఒకవస్తువునుచూసి మరొకవస్తువుఅనుకోవటం. ఒకవస్తువు ఇంకోవస్తువుగా కనబడటంవలన సంసారం ప్రారంభమవుతుంది. తాడు పాముగాకనిపించిందిఅనుకో అక్కడనుండి భయం ప్రారంభమవుతుంది. తాడుతాడుగా కనబడితే ఏమీలేదు. అలాగేఉన్నది బ్రహ్మమే. బ్రహ్మమే నీకులోకంగా కనబడుతోంది. అక్కడనుండి సంసారం ప్రారంభమవుతోంది. దేహాన్ని ఆత్మఅనుకొంటున్నావు. దేహమేనిజంఅనుకొంటున్నావు. నిజంకానిదానిని నిజం అనుకొంటున్నావు అక్కడనుండి సంసారం ప్రారంభమయింది, రాగద్వేషములు ప్రారంభమయినాయి. చనిపోయినతరువాత ఏమౌతాముఅని అడుగుతూఉంటారు. నీకు అసలు చావులేదు. నీలోపలఉన్న చైతన్యమేనీవు. నీవుఎవరోనీకు తెలియకపోవటంవలన ఈప్రశ్నలువస్తున్నాయి. చావులేనివస్తువే నీవుఅన్నసంగతి నీకుఅర్థమయితే చనిపోయిన తరువాత ఏమౌతాముఅనే ప్రశ్న ఉదయించదు. ఇదిఅంతా Wrong thinking వలన వస్తోంది.

దీర్ఘకాలంనుండి వస్తున్న వాసనలను తొలగించుకోవటానికి దీర్ఘమైన అభ్యాసం ఉండాలిఅని ఒకచోట భగవాన్‌చెప్పారు. నీవు 10 సం॥ల నుండి ఏదోరోగంతో బాధపడుతున్నావుఅనుకో దానికి ఈరోజు ఏదో ఒకబిళ్ళవేసుకోవటంవలన అది తగ్గిపోదు. దానికి చాలాకాలం ట్రీట్‌మెంట్ అవసరం. అలాగే జన్మాంతరంనుండి ఒకవాసన వస్తోందిఅనుకో దానినుండి విడుదలపొందటానికి దీర్ఘకాలం సాధనచేయవలసిందే. దీర్ఘకాలంసాధనచేసినా ఫలితంవస్తుందిఅని చెప్పలేము. ఫలితం నీచేతిలోలేదు. నీవు దీర్ఘకాలం సాధనచేయాలి, కాలంకలిసిరావాలి, గురువుఅనుగ్రహంఉండాలి. Devine interference లేకుండా నీవు హృదయగుహలో ప్రవేశించలేవు. మనస్సును ఉపసంహరించు. అది ఎక్కడపుట్టివస్తోందో అక్కడవరకు దానిని ఉపసంహరించు. అంతేగాని కొంతదూరంవెళ్ళి

వెనుకకువచ్చి వేయవద్దు. దానికి పట్టుదల ఉండాలి. మనస్సు దానిమూలంలోనికి వెళ్ళేవరకు దానిని వెంటాడుతూవెళ్ళాలి. మనస్సు దానిమూలంలోనికి వెళితే అదినశిస్తుంది. అప్పుడు నీకు ఆత్మానుభవంకలుగుతుంది, ఆత్మశాంతి నీచేతికి అందుతుంది. అప్పుడు నీసుఖంకోసం, ఆనందంకోసం బయటవస్తువులమీద ఆధారపడవలసిన పనిలేదు. మీకు ఏదైనా అగౌరవం వచ్చిందిఅనుకోండి మీలోపల గౌరవానికి సంబంధించిన కాంక్ష లేకపోతే మీకు అగౌరవంవచ్చినా ఏమీఅనిపించదు. మీకు గౌరవానికి సంబంధించిన కాంక్ష ఉంటే అగౌరవం వచ్చేటప్పటికి భయంవస్తుంది. గౌరవాలకు, అగౌరవాలకు అతీతంగా ఉండుఅని భగవంతుడు చెప్పాడు. వీటిలో ఊగిసలాడుతూఉంటే నీకు పునర్జన్మవచ్చేస్తుంది. నీవు గీతను రోజూ అధ్యయనం చేస్తావుఅనుకో. సుఖంవచ్చినా, దుఃఖంవచ్చినా సమానంగా ఉండలేవుఅనుకో దానివలన ప్రయోజనంఏమిటి? రోజూ చదువుతావుఅనుకో దానిని ప్రాక్టీసు చేయవుఅనుకో దానివలన ప్రయోజనంఏముంది? నీకుఏదైనా అనుభవంఉంటే దానితాలుక ప్రభావం నీప్రవర్తనలో ఎక్కడోఒకచోటకనబడాలి. నీవు నిజమైనస్థితిలోఉంటే నీకు దుఃఖంఎందుకువస్తోంది. నీకు దుఃఖంవస్తోందిఅంటే నీవు నిజమైనస్థితిలోలేవు అని నీకు అర్థమవుతోందికదా. బాహ్యవిషయాలకు నీమనస్సు ఆకర్షింపబడుతూఉంటే అది లోపలకువెళ్ళదు. నీ హృదయంలోఉన్న వైభవం గురించి శ్రవణంచేయగాచేయగా, గురువుచెప్పిన దానిని మననం చేయగాచేయగా మనస్సు ఎప్పుడో అటుతిరుగుతుంది. ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు అనుభవంలోనికి వచ్చేవరకు ఏదోసందేహం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. అబ్దుల్‌కలామ్ ఆయన పెద్ద సైన్‌టిస్టు. ఆయన చదువు పూర్తిఅయిన తరువాత ఉద్యోగంకోసం వెళ్ళినప్పుడు అందులో 11 మందిని తీసుకొన్నారట. ఈయన 12వ వాడి క్రింద ఉన్నారట. అంటే ఈయన ముందు వరకు తీసుకొన్నారు. అప్పుడు ఆయనకు చాలా దుఃఖంవచ్చింది. అక్కడ ఉన్న శివానంద ఆశ్రమానికి వెళ్ళారట. శివానంద్ ఆయననుచూసి నీవు ఇలాదుఃఖపడవద్దు, ఇదినీమంచికేవచ్చింది. నీవు బాగాచదువుకొన్నావుగాని నీకు జీవితానుభవంలేదు. నేను ఓడిపోయాను, నేను ఓడిపోయాను అనుకొంటున్నావు. ఆ ఓటమిని ఓడించు నీవు జీవితంలో అభివృద్ధిలోనికి వస్తావుఅని శివానంద్ చెప్పారట. నీ జీవితంలో అనేక ఓటమిలు రావచ్చు. ఓటమిని ఓడించు. ఈమంత్రం నాజీవితంలో అనేక విజయాలను సాధించిపెట్టిందిఅని కలామ్ చెప్పారు. అప్పటినుండి నేను ఎక్కడపనిచేసినా నైతికనిష్టను విడిచిపెట్టలేదుఅని కలామ్ చెప్పారు. దేశంలో 70% మంది పల్లెటూరులో జీవిస్తున్నారు. అందులో చాలామందికి సరిపడ తిండి, బట్టలేదు. వారి జీవనప్రమాణాన్ని పెంచటానికి సైన్స్‌ను ఉపయోగించాలి లేకపోతే ఈ సైన్స్ ఎందుకుఅని కలామ్ అన్నారు.

05-02-2002



# రమణభాస్కర

**(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 5-1-2002, ఏలూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శాస్త్రాలు ఏమిచెపుతున్నాయిఅంటే మనోనిగ్రహంముఖ్యంఅని చెపుతున్నాయి. మీకుఎంతధనంఉంది, ఎంతచదువుఉంది, ఎంతఅధికారంఉందిఅనేది ముఖ్యంకాదు, మనోనిగ్రహంముఖ్యం. మనకు మోక్షంకావాలంటే మనోనిగ్రహం, క్రమశిక్షణ అవసరం. కాలేజీలో చదువుకోవటంవలన మనకు మనోనిగ్రహం, క్రమశిక్షణరావు. భక్తివలన క్రమశిక్షణవస్తుంది. రోజూమీకు ఇష్టమైన దేవతాపురుషుని ఆరాధించటంవలన మనోనిగ్రహం, క్రమశిక్షణవస్తాయి. మనకు రూపుబుద్ధి, నామబుద్ధిఉంది. వీటిలోనుండి విడుదలపొందాలంటే ఒక దేవతాపురుషుడిని ఉపాసనచేయటం అవసరం. భగవంతుడు అంతటా ఉన్నాడుకదా మనం ప్రత్యేకంగా గుడికివెళ్ళి భగవంతుని ఆరాధించటంఎందుకు? గుడి అవసరంఏమిటిఅని ఒకభక్తుడు స్వామి చిన్మయానందను అడిగాడు. ఆయన ఏమిచెప్పారుఅంటే ఆవు శరీరంలో పాలు ఉండవచ్చు. అలాఅని ఆవుకొమ్ములు పట్టుకొని పిండితే పాలురావు, చెవులుపట్టుకొని పిండితే పాలురావు. పొదుగుదగ్గర ఉన్న సన్నకట్లను పట్టుకొని పిండితే పాలువస్తాయి. అదేవిధంగా దేవుడుఅంతటా ఉన్నప్పటికి దేవాలయానికివెళ్ళి అక్కడఉన్న భగవంతునియొక్క రూపాన్ని ఆరాధించటంవలన అంతటా ఉన్న భగవంతుడు మనకు వ్యక్తమవుతాడు. భగవంతుడు మనకు కర్మయోగంచెప్పాడు, జ్ఞానయోగంచెప్పాడు. మనం ఏయోగంలో ప్రయాణంచేసినా భక్తిఅవసరం. ఈశ్వరునిపట్ల భక్తిలేనప్పుడు మనకు జ్ఞానయోగంకుదరదు, కర్మయోగంకుదరదు. కర్మయోగంలో, జ్ఞానయోగంలో భక్తియోగం మిళితమైఉంది.

దైనందిన జీవితంలో మనం చేసేపనిని యోగంగాచేయాలి. భగవంతుడు మనకు కేటాయించిన పనిని త్రికరణశుద్ధిగా, హృదయపూర్వకంగా, ఫలాపేక్షలేకుండా చేస్తే మనకు పవిత్రత వస్తుంది. మన అందరిలోఉన్న లోపంఏమిటిఅంటే మనకు పనియందు గౌరవంలేదు. ఆఫీసులో ఒకరకంగా పనిచేస్తాము, ఇంటిదగ్గర ఒకరకంగాపనిచేస్తాము. ఇంటిదగ్గర మన సొంతపనిని ఎంతశ్రద్ధగాచేస్తామో, ఆఫీసులోపనినికూడా అంత శ్రద్ధగాచేస్తే మనం బాగుపడతాము, దేశంబాగుపడుతుంది. సమాజంకోసం, దేశంకోసం మనం కష్టపడిపనిచేయాలి. దేశభక్తివలనకూడా మనహృదయం విశాలమవుతుంది. గాంధీగారు స్వార్థంలేకుండా దేశానికి సేవచేసి ఆయన మహాత్ముడు అయ్యాడు. పబ్లిసిటీకోసం మనం పనిచేస్తే దానివలన ఏకాగ్రతరాదు, పవిత్రతరాదు. దేశంకోసం మనం ఎంతోకొంత పనిచెయ్యాలి, మనకు దేశభక్తికూడాఅవసరం. భగవంతుడు మనహృదయంలోనేఉన్నాడు.